క్లుప్తంగా

ఫోన్ అప్పగింత

తానూరు: భైంసా పట్టణానికి చెందిన అంకం నగేశ్ ఈనెల 5న పని నిమిత్తం భైంసా నుంచి తానూరు వస్తుండగా ఫోన్ పొగొట్టుకున్నాడు. అదే రోజు తానూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ వివరాలతో ఫోన్ ఆచూకీ కనుక్కొని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఫోన్ అప్పగించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

'కంటివెలుగు' ప్రారంభం

ముధోల్: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్య రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎడ్‌బిడ్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ స్వర్ణలత దత్తాత్రి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



పోటీలు నిర్వహిస్తున్న సీడీపీవో నాగలక్ష్మి

భైంసాటౌన్: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యవంతులుగా మారుతారని..గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. సోమవారం భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు చిరుధాన్యాల ఆవశ్యకత వివరించారు. అనంతరం పలువురు టీచర్లకు చిరుధాన్యాలతో ఆహారం తయారీపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో రాజారపు భోజన్న అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయిన సంగతి తెలిసిందే. సోమవారం బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా పంటతాలూకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడినుంచి మహవీర్ తండాకు చెందిన రాథోడ్ విజేష్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం ప్రకటించారు. జిల్లా అధికారులతో మాట్లాడి రైతుకు పరిహారం అందేలా కృషి చేస్తానని అన్నారు. వారి వెంట బీజేపీ మండలాధ్యక్షుడు విలాస్, నాయకులు వీరయ్య, చెన్ను రాజేశ్వర్, ఆర్‌వి రమణ, తిరుమలచారి తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



దుకాణంలో బస్తాలు పరిశీలిస్తున్న ఏవో

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాన్ని సోమవారం మండల వ్యవసాయ అధికారి ఆసం రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. ఎరువులు, విత్తనాల ధరలు రైతులకు తెలిసేలా నోటీస్ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.30
వంకాయ	60
బెండకాయ	60
పచ్చిమిర్చి	70
కాకరకాయ	70
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	180
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

\- నిర్మల్‌టౌన్



సినిమాలు
తిరుమల : కస్టడీ
నారాయణ : విరూపాక్ష

ప్రారంభమైన క్రీడా సంబురం

- సీఎంకప్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత
- మరో రెండు రోజులు సాగనున్న పోటీలు



ముధోల్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



కుభీర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో కవిరాజు

ముధోల్: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎంకప్ ఆటల పోటీలను సోమవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. త్వరలో ముధోల్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక సర్పంచ్ రాజేందర్ క్రీడాకారులకు తన వంతు సాయంగా తయారు చేసిన టీషర్టులను ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడాకారులకు అందించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్, ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్, సర్పంచ్ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, రాంరెడ్డి, ఎంఈవో మైసాజీ, ఎంపీడీవో సురేశ్ బాబు, ఎస్సై సాయికిరణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఎస్వీజీ డిగ్రీ కళాశాలలో సీఎం కప్ పోటీలను ఎంపీపీ అడ్వాల పద్మ ప్రారంభించారు. బాలుర విభాగంలో ఆరు జట్లకు పోటీలు నిర్వహించారు. కబడ్డీలో లక్ష్మణచాంద జట్టు.. పార్‌పెల్లి జట్టుపై గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికైంది. ఖోఖోలో చామన్‌పెల్లి జట్టు.. లక్ష్మణచాంద జట్టుపై గెలుపొంది జిల్లా స్థాయికి వాలీబాల్‌లో మల్లాపూర్ జట్టు పార్‌పెల్లి జట్టుపై గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ట్రోఫీలతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీడీవో నసీరుద్దీన్, ఎస్సై రాహుల్, పీడీలు శ్రీనివాస్, వెంకటరమణ, పీఈటీలు సంగీత, శారద, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ మోహిద్ ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, కమిషనర్ రత్నాకర్‌రావు, ఎంపీడీవో మల్లేశ్, తహసీల్దార్ రాజమోహన్, ఎస్సై శంకర్, పీఈటీలు పాల్గొన్నారు.

సారంగపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ ఆటల పోటీలను సోమవారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీఓ, సీఎం కప్ కన్వీనర్ సరోజ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ పద్మ, ఎస్సై కృష్ణసాగర్, ఎంపీఓ తిరుపతిరెడ్డి ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కప్ పోటీలను ఎంపీపీ సింగరి కిషన్ ప్రారంభించారు. తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, సర్పంచ్ రాజమణి, శివయ్య పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సీఎంకప్ పోటీలను ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ ప్రారంభించారు. సర్పంచ్ సమత, తహసీల్దార్ ఎంఏ కలీం, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంఈవో ముత్యం, రాజబాపు, పీడీలు పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. తహసీల్దార్ వెంకటరమణ, సర్పంచ్ విఠల్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, సర్పంచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మామడ: మండల కేంద్రంలో సీఎంకప్ మండల స్థాయి క్రీడలు సోమవారం ఎంపీడీవో రమేశ్ ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో 14 జట్లు పాల్గొనగా మామడ జట్టు.. వాస్తాపూర్ జట్టును ఓడించి విజేతగా నిలిచింది. కన్వీనర్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ సంతోష్, ఎంపీవో గోవర్ధన్, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, పీఈటీ సచ్చేందర్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో సీఎం క్రీడా పోటీలను సోమవారం ఎంపీపీ కొంద్ర రేఖ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ అల్లాడి వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, కొంద్ర రమేశ్, గంగారెడ్డి, పీడీ దేవేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం సీఎం కప్ పోటీలను ఎంపీడీవో కవిరాజు, సర్పంచ్ మీరా ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు నిర్వహించగా సమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పీడీ సత్యయ్య, సర్పంచ్‌లు చంద్రకాంత్ (చొండి) అశ్విని, (ఫకీర్ నాయక్‌తండా) పాల్గొన్నారు.

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఎం కప్ పోటీలను ఎంపీపీ కల్పన ప్రారంభించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, ఎంఈవో సుభాశ్, ఎంపీవో మోజం హుస్సేన్, ఎస్సై శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యులు గజానంద్ పాల్గొన్నారు.

పెంబి: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, అధికారులు, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్ఐ హుస్సేన్, ఎస్సై రజినీకాంత్, గోవింద్, రామేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: క్రీడాకారులతో ఎంపీపీ అడ్వాల పద్మ



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ మోహిద్



భైంసాలో ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్పన, అధికారులు



మామడలో క్రీడాకారులతో ఎంపీడీవో రమేశ్



తానూరులో పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

జామ్‌లో గ్రామసభ

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో సర్పంచ్ మురళీకృష్ణ అధ్యక్షతన సోమవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందాలు గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్పీ కవిత మాట్లాడుతూ గ్రామంలో డిసెంబర్ 1వతేదీ 2019 నుంచి 31 మార్చి 2023వరకు 3కోట్ల 31లక్షల 79వేల రూపాయల విలువైన ఉపాధి పనులకు సంబంధించి వారంరోజులు సామాజిక తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గుర్తించిన అవకతవకలను గ్రామసభలో వెల్లడించారు. అనంతరం కూలీల వివరణ, ఎఫ్ఏ, పంచాయతీ కార్యదర్శుల వివరణను రాతపూర్వకంగా స్వీకరించారు. ఈమొత్తం వివరాలను సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విలాస్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, శ్రీనివాస్, ఫిషాన్, పలువురు గ్రామస్తులు రాజలింగం, కూలీలు, తదితరులు ఉన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో డిసెంబర్ 1వ తేదీ 2019 నుంచి 31 మార్చి 2023 వరకు జరిగిన ఉపాధిహామీ పనుల్లో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు మంగళవారం ఉదయం 10 గంటలకు 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల ఉపాధి కూలీలు, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

మున్నూరుకాపు సంఘ సమావేశం

లోకేశ్వరం: మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకుందామని ఆ సంఘం తాలూక అధ్యక్షుడు రోల్ల రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని గడ్‌చాంద గ్రామంలో మున్నూరుకాపు సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల సంఘాల పనితీరు తెలుసుకున్నారు. గడ్‌చాందలో సంఘం సభ్యుడు ఒడ్నం శంకర్ కుమారుడు రాజేశ్వర్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు మంద లింగన్న, కుంటాల భోజన్న, దేవన్న, సాయన్న, విద్యాసాగర్, సంతోశ్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఆడపిల్లలకు వరం కల్యాణలక్ష్మి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నర్సాపూర్(జి): ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వరమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో సోమవారం 13 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నందన్ గ్రామానికి చెందిన అల్లాడి రేఖ అనే మహిళకు మంజూరైన రూ.1లక్ష విలువైన చెక్కును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నస్రీన్‌బేగం, తహసీల్దార్ శ్రీకాంత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపెన్ రాజేశ్వర్, రమేశ్, సుధాకర్, ఖదీర్, మక్బుల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించారు. రైతువేదికలో 47మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 10 మందికి రూ.మూడు లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జోహర్‌పూర్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నేపాల్‌లో జరిగే ఖోఖో పోటీల్లో పాల్గొనే మండలంలోని మన్మద్‌కు చెందిన సాయిప్రసాద్‌ను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సన్మానించారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, అదనపు కలెక్టర్ రాంబాబు, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సల్మాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



లోకేశ్వరం: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

భైంసా: బాసర మండలంలోని సావర్గం గ్రామంలో సోమవారం బీరప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రూ.10లక్షలు సీజీఎఫ్ నిధులు, గ్రామస్తుల విరాళం రూ.2లక్షలతో ఆలయం నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ సుశీల బాపురావు, సర్పంచ్ మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



బామిని(బి)లో కేంద్రం వద్ద సర్పంచ్ పుష్పల,నేతలు



ముధోల్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న వెంకటేశ్‌గౌడ్

నర్సాపూర్(జి): కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని కుంటాల పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, బామిని(బి) సర్పంచ్ దేవోల్ల పుష్పల అన్నారు. సోమవారం మండలంలోని నందన్, బామిని(బి) గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న రామయ్య, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, ఉపసర్పంచ్ విఠల్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ రాందాస్, వినాయక్, భోజన్న, సాయినాథ్, సెంటర్ నిర్వాహకులు ప్రవీణ్ పాటిల్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్‌లో..

ముధోల్: రైతుల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్, రైతుబంధు మండలాధ్యక్షుడు రాంరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, సర్పంచ్ రాజేందర్, సురేందర్‌రెడ్డి, ధర్మపురి, సుదర్శన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో ఓపెన్‌జిమ్ మాయం.!



కుంట ప్రాంతంలోని ఓపెన్‌జిమ్(ఫైల్)



ప్రస్తుతం ఓపెన్‌జిమ్ ప్రాంతంలో నిర్మాణ పనులు


భైంసాటౌన్: పట్టణంలోని కుంట ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌ను తొలగించి భవన నిర్మాణం చేపడుతున్నారు. పట్టణ ప్రజల కోసం గతంలో సీడీఎంఏ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణను మాత్రం గాలికొదిలేయడంతో అందులోని పరికరాలు వృథాగా మారాయి. ప్రస్తుతం ఓపెన్‌జిమ్‌లోని పరికరాలను మరో చోటకు తరలించి అక్కడ భవనం నిర్మిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఓపెన్‌జిమ్ స్థలంలో మరో భవన నిర్మాణ విషయం తన దృష్టికి రాలేదని.. విచారణ జరుపుతామన్నారు.



పందుల స్వైరవిహారం

నిర్మల్‌లోని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పరిసరాలు అధ్వానంగా మారుతున్నా.. సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో పశువులు, ఇతర జంతువుల వైద్యానికి వచ్చేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



రుణం సకాలంలో చెల్లించాలి

నిర్మల్‌చైన్‌గేట్: వీధి వ్యాపారులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే మరింత ఎక్కువ రుణం అందిస్తామని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అనంతపేట్‌శాఖ మేనేజర్ అశోక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌లో వీధి వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులు తీసుకున్న రుణం చెల్లిస్తే మరో దఫా ఎక్కువ రుణం ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాఖ పరిధిలో 150 మంది వీధి వ్యాపారులు రుణాలు పొంది కేవలం 60 మంది మాత్రమే సక్రమంగా చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ కోఆర్డినేటర్ స్రవంతి, బంగల్‌పేట్, నాయుడువాడ, బేస్తవార్‌పేట రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పాడి రుణాలపై అవగాహన

లోకేశ్వరం: పాడి గేదెలు, ఆవులను కొనేందుకు రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తామని ఐకేపీ సీసీ సుకుమార్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని పిప్రి గ్రామంలో పాడి రైతులకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మేలుజాతి పశువులను మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి.. విజయ డెయిరీకి పాలు అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ సూపర్‌వైజర్ రమేశ్, సీసీలు మహేందర్, రాజేశ్వర్, మల్లేశ్ పాల్గొన్నారు.

దుమారం రేపిన తీర్మానం

కడెం: కాంగ్రెస్ పార్టీ కడెం మండల అధ్యక్షుడి ఎన్నిక కోసం ఓ వ్యక్తికి మద్దతు తెలుపుతూ తీర్మానం చేయడంపై పార్టీలో రెండు వర్గాల మధ్య తీవ్ర దుమారం రేపింది. వివరాల్లోకి వెళితే.. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని ఓ వర్గానికి నేతృత్వం వహించి తుమ్మల మల్లేశ్ అనే వ్యక్తిని మండల అధ్యక్షునిగా నియమించేందుకు సోమవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో కార్యకర్తలను ఏకం చేసి తీర్మానం చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న సీనియర్ నాయకులు, ఖానాపూర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పొద్దుటూరు సతీశ్‌రెడ్డి ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు మాత్రమే తీర్మానం చేయడం సరికాదన్నారు. మండల అధ్యక్ష ఎన్నిక అనేది డీసీసీ అధ్యక్షులు నిర్ణయించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కమిటీలో లేనప్పుడు మండల కమిటీ ఎన్నిక చెల్లదని.. దీన్ని తమ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రంజన్లలో నీటిని నింపరూ..



కుభీర్: మండలం కేంద్రంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ ముందు, హనుమాన్ మందిరం వద్ద రెండు చలివేంద్రాలు గత నెలలో ఏర్పాటు చేశారు. కానీ గత వారం రోజులుగా అక్కడ రంజన్లలో నీళ్లు ఉంచడం లేదు.. గ్లాసులు కూడా లేవు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పంచాయతీ వారు స్పందించి రంజన్లలో నీటిని నింపాలని పలువురు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: విజయ్, కుభీర్ ఈవో, ఫోన్: 73969 16252

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899